క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు

చిత్తూరు కార్పొరేషన్: జీడీనెల్లూరులో శనివారం సీఎం పర్యటించనున్న సందర్భంగా విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఏర్పాట్లు చేశామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. ఈఈలు 6, డీఈలు 8 మందికి డ్యూటీలు వేశామన్నారు. అలాగే 5 జనరేటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి: పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

శివపార్వతులకు ప్రత్యేక పూజలు


ఊరేగింపు

పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురం గ్రామంలో శివరాత్రి పండుగ పురస్కరించుకుని గురువారం శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వైభవంగా శ్మశాన కొల్ల నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఊరేగింపులో వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. గ్రామానికి సమీపంలో ఉన్న శ్మశానానికి అమ్మవారిని తీసుకెళ్లి పూజలు నిర్వహించారు.

శివరాత్రి ఆదాయం రూ 3.94 లక్షలు


హుండీ కానుకల లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

బంగారుపాళెం: మొగిలి శివాలయానికి మహాశివరాత్రి ఆదాయం రూ.3,94,693 వచ్చినట్లు చిత్తూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో మహాశివరాత్రి రోజు వచ్చిన కానుకలు లెక్కించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీల ద్వారా రూ 1,54,354, సేవా టిక్కెట్లు విక్రయాలతో రూ 2,04,720, అన్నదానానికి విరాళాల రూపేణా రూ 35,616 వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆశల రుణాలు అందేనా?

- యూనిట్లు మూరెడు దరఖాస్తులు బారెడు
- గంపెడాశలు పెట్టుకున్న అర్హులు
- రుణాల కోసం కూటమి నేతలు పైరవీలు
- దరఖాస్తుదారులకు అధికారులు, బ్యాంకర్ల ఇంటర్వ్యూలు
- సామాన్యుల్లో సన్నగిల్లుతున్న ఆశలు



ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు, ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు, బ్యాంక్ మేనేజర్లు

నగరి: బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికి గురువారం స్థానిక మెప్మా కార్యాలయంలో అధికారులు, బ్యాంక్ మేనేజర్లు ఇంటర్‌వ్యూలు నిర్వహించారు. దీంతో మెప్మా కార్యాలయంతోపాటు ఆవరణ అంతా నిరుద్యోగ యువతీయువకులతో నిండిపోయింది. నిరుద్యోగులు తమ విద్యార్హత సర్టిఫికెట్లను, తాము చేయదలచుకున్న వ్యాపారాలను అధికారులకు వివరించారు. రుణం అందిస్తే తాము ఉపాధిని ఏర్పరచుకోగలమంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రుణాలపై గంపెడాశలు

రుణం అందుతుందని నిరుద్యోగులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. అయితే పదుల చొప్పున యూనిట్లు మంజూరైతే దరఖాస్తులు మాత్రం వందల్లో వచ్చాయి. దీంతో పలువురు దరఖాస్తుదారులు స్థానికంగా ఉండే కూటమి నాయకుల చుట్టూ రుణాలు ఇప్పించాలని ప్రదక్షిణలు చేస్తున్నారు. యూనిట్ల కేటాయింపు జరిగిన రోజు నుంచే సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం పెరిగిపోయింది. దీంతో అర్హతలు ఉన్న సామాన్యులు సైతం ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు కూటమి పార్టీలు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి కల్పిస్తామని ప్రగల్భాలు పలికింది. కానీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా హామీల అమలు ఊసే లేదు. ఇప్పటికే ఆరు హామీలు అమలు చేయకపోవడంతో సామాన్య ప్రజలు కూటమి ప్రభుత్వంపై రగిలిపోతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నగరి మున్సిపాలిటీలో 70 యూనిట్లు మంజూరు కాగా 492 మంది దరఖాస్తు చేసుకున్నారు. రూరల్ మండలంలో 58 యూనిట్లు మంజూరుకాగా 214 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని బీసీలు, కాపు, ఈడబ్ల్యూఎస్ కింద ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కేటగిరీలుగా విభజించి కేటాయించారు. దీంతో మున్సిపల్ వార్డుకు, మండలంలోని పంచాయతీకి ఇద్దరికో మాత్రమే అవకాశం ఉంటుంది. నామమాత్రంగా యూనిట్లు కేటాయించడంపై నిరుద్యోగ యువత అసహనం వ్యక్తం చేస్తోంది. యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉన్న ఈ రుణాలను దక్కించుకునేందుకు అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు పలుకుబడి ఉన్న నేతల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణ చేస్తున్నారు.

పెరిగిన పోటీ

ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ యూనిట్లు అంతంతమాత్రంగానే ఉండడం, ప్రతి వార్డు, గ్రామాల నుంచి దరఖాస్తులు వందల్లో రావడంతో తీవ్ర పోటీ నెలకొంది. 128 యూనిట్లకు 706 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రతి ఆరుగురిలో ఒక్కరికి మాత్రమే రుణాలు అందే ఆస్కారం ఉంది. దీంతో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకుల మధ్యే తీవ్ర పోటీ నెలకొనడంతో సామాన్యులు నిరాశ చెందుతున్నారు. అధికార పార్టీ వారిని దాటుకుని తమకు రుణాలు రావడం అసాధ్యమని నిర్ణయించుకుంటున్నారు. ఎలాగూ దరఖాస్తు చేశామని, ఓ ప్రయత్నం చేస్తే పోలా అన్నట్లుగా మరికొందరు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. సుమారు రూ.500కు పైగా ఖర్చు చేసి ఆన్‌లైన్‌లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత చదువులు అభ్యసించి ఖాళీగా ఉన్న యువతకు ప్రాముఖ్యత ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అర్హత మేరకు రుణాల మంజూరు



బీసీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఇంటర్వ్యూలు ముగిశాయి. అర్హులైన వారిని బ్యాంకర్లతో కలిసి ఎంపిక చేస్తాం. ఇందుకంటూ ప్రత్యేక కమిటీలు లేవు. అర్హతను అనుసరించే రుణాలు అందిస్తాం.

–కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూ

విజయపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ రాజేంద్ర ఆధ్వర్యంలో వివిధ బీసీ కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూ నిర్వహించారు. నగరి, విజయపురం, నింద్ర మండలాలకు చెందిన బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 144 దరఖాస్తులకు 111మంది అభ్యర్థులు హాజరయ్యారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్

తవణంపల్లె: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని తవణంపల్లె వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ కోరారు. గురువారం మండలంలోని మత్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వ పథకాల ఫలాలు పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. పంటలకు పురుగులు, తెగుళ్ల ఆశించినా వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


1న మార్కెట్ వేలం

ఐరాల: మండలంలోని కాణిపాకం పంచాయతీ కార్యాలయం మార్చి1న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఈఓపీఆర్డీ కుసుమకుమారి తెలిపారు. పంచాయతీకి సంబంధించిన దినసరి సంత, వారపు సంత, షాపింగ్ కాంప్లెక్స్ రూములు, చేపల చెరువుకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా శ్మశాన కొల్లు



అమ్మవారికి పూలదండ వేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో అంకాళ పరమేశ్వరి దేవి


శ్మశానంతో ఏర్పాటుచేసిన దక్షుణి ప్రతిమ

నగరి: మున్సిపల్ పరిధి సత్రవాడ శ్రీఅంకాళ పరమేశ్వరి ఆలయంలో గురువారం శ్మశాన కొల్లు (మయానకొల్ల) ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది కుశస్థలీ నది గట్టున ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహా శివరాత్రి పర్వదినం తరువాత ఈ ఉత్సవాలు జరుగుతాయి. పర్వతరాజ కులస్తులు తరతరాలుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కుశస్థలి నదిలో సుమారు 20 అడుగుల పొడవున్న దక్షుడి మట్టిబొమ్మను తయారు చేశారు. ఆనవాయితీ ప్రకారం మట్టిబొమ్మపై భక్తులు కుడుములు, గుగ్గిళ్లు, కుంభం వేసి మొక్కుకున్నారు. శ్రీఅంకాళ పరమేశ్వరి అమ్మవారిని మహిషాసురమర్ధినిగా అలంకరించిన అనంతరం శ్మశానకొల్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం భక్తులు ఇనుప కొక్కీలు శరీరానికి పొడుచుకొని క్రేన్‌కు కట్టిన తాడుకు వేలాడుతూ ముందుకు వెళ్లి అమ్మవారికి పూల దండలు వేయడంతో హర్షధ్వానాలు చెలరేగాయి. అనంతరం మహిషాసురమర్ధిని అలంకారంలో ఉన్న అమ్మవారిని ఆలయం వద్ద నుంచి మేళతాళాలు, బాణాసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా నది వద్దకు తీసుకెళ్లారు. అక్కడ దక్ష వధకు ప్రతీకగా తయారుచేసి ఉంచిన దక్షుని బొమ్మ చుట్టూ అమ్మవారి విగ్రహాన్ని 3 సార్లు ప్రదక్షిణ చేసిన అనంతరం అక్కడ ఉంచిన ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ వేడుకలను తిలకించడానికి భారీ ఎత్తున గ్రామస్తులు తరలివచ్చారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



వెదురుకుప్పం: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న దంపతులు

వెదురుకుప్పం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం శివపార్వతుల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పెళ్లి మండపానికి తీసుకొచ్చి వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధపరిమళాలు వెదజల్లే పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం అర్చకులు సాంప్రదాయ పద్ధతిలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి మండలం నుంచి అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నగరి: డివిజన్‌లోని కార్వేటినగరం మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు ఆర్డీఓ భవానీశంకరి ఆధ్వర్యంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్వేటినగరం మండలంలోని పెద్ద హరిజనవాడ అంగన్‌వాడీ కార్యకర్త, ఆర్‌కేవీబీపేట అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు ఐదుగురు హాజరయ్యారు. వీరికి ఆర్డీఓ సమక్షంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరి, వైద్యాధికారి కీర్తిప్రియ, నగరి, కార్వేటినగరం సీడీపీఓలు కృష్ణవేణి, పద్మసునంద ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆఫీసు సిబ్బంది కరుణాకర్‌రెడ్డి, మీనమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

గంగాధరనెల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి మార్చి 1వ తేదీన గంగాధరనెల్లూరుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. రామానాయుడుపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని అనంతపురం డీఐజీ షిముషి బాజ్‌పాయ్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 1వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను గంగాధరనెల్లూరు ఎస్టీ, బీసీ కాలనీలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, అడిషినల్ ఎస్పీ శివానందకిషోర్, సీఎం సెక్యూరిటీ ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

దర్జీ జీవనం దయనీయం

దుస్తులు కుట్టే చేసే దర్జీల జీవనం దర్జాగా ఉండేది. అది ఒకప్పటిమాట. రెడీమేడ్ సామ్రాజ్యం విస్తరించడంతో దర్జీల జీవనం దయనీయంగా మారింది. చేతినిండా పనిలేక కుటుంబపోషణ జరగక నానా ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్ఆర్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు దర్జీలను ఆదుకుంది. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం దర్జీలపై చిన్నచూపు చూస్తోంది. నేడు టైలర్స్ డే సందర్భంగా దర్జీల ఆవేదనపై ప్రత్యేక కథనం.

–పాలసముద్రం

- టైలర్ల ఆదాయం అంతంత మాత్రమే..
- దెబ్బతీస్తున్న రెడీమేడ్ దుస్తులపై మోజు
- నేడు టైలర్స్ డే


కొత్త రకం దుస్తులు కుడుతున్న మహిళ టైలర్లు

దుస్తులు కనీసావసరం కావడంతో సమాజంలో టైలర్లకు డిమాండ్ ఉంటుంది. టైలరింగ్‌ను ఇళ్లల్లో మహిళలు కూడా నేర్చుకుంటారు. దర్జీ వృత్తిదారులు, వారి సహాయకులు, కుట్టు మెటీరియల్ విక్రయించే వారు ఇలా అనేక మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తుంటారు. అయితే వివిధ రెడీమేడ్ దుస్తులపై ప్రజలకు మోజు పెరిగింది. దీంతో దర్జీల జీవనం దయనీయంగా మారింది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 138 గ్రామాలలో సుమారు 1718 మందికిపైగా టైలర్లు ఉండగా వారిలో 535 మంది మహిళలున్నారు. ఒకప్పుడు కుటుంబ సభ్యులందరూ ఇదే వృత్తిపై ఆధారపడి జీవించేవారు. చేతినిండా పని కరువవ్వడంలో టైలర్లు తమపని మానుకొని వలస పోతున్నారు. కొందరూ ఫ్యాషన్ మెటీరియల్ తయారు చేసేవారుగా, రెడీమేడ్ వస్త్రాలను తయారు చేసే వారుగా మారుతున్నారు. వృత్తి సహాయకులు వస్త్ర దుకాణాల్లో, గ్రామాల్లో వస్త్రాలను అమ్మకాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇదే వృత్తిలో కొనసాగాలనుకునే వారికి సహాయకులు కూడా కరువవుతున్నారని సీనియర్ టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టైలరింగ్ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో కుట్టుకూలీ రేటు పెంచాల్సి వస్తోందని. దీంతో వినియోగదారులు చౌకగా, వెరైటీగా వస్తున్నాయని రెడీమేడ్ దుస్తుల వైపు మళ్లుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

దర్జీ వృత్తినే నమ్ముకున్నవారిని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. భవన నిర్మాణ కార్మికులకు, డప్పు కళాకారులకు, కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులిచ్చిన విధంగా టైలర్లకు కూడా గుర్తింపు కార్డులిచ్చి పింఛన్ ఇవ్వాలని కోరుతున్నారు.

మండలం పేరు	పంచాయతీలు	మొత్తం టైలర్లు
గంగాధరనెల్లూరు	32	452
శ్రీరంగరాజుపురం	23	250
కార్వేటినగరం	21	232
వెదురుకుప్పం	25	326
పెనుమూరు	24	295
పాలసముద్రం	13	163

అద్దె చెల్లించలేని పరిస్థితి

దర్జీల వద్ద దుస్తులు కుట్టించుకునే వారు రోజు రోజుకూ తగ్గుతుండడంతో మాకు పనులు కరువయ్యాయి. దీంతో మా షాపులకు అద్దెలు, విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై రుణాలు, కుట్టుమిషన్లు అందించి ఆదుకోవాలి.

–జాన్ బాషా, వెంగళరాజుకుప్పం, టైలర్

పింఛన్లు, ఇళ్ల స్థలాలివ్వాలి

టైలరింగ్ వృత్తిని నమ్ముకుని వేరేపని చేయలేకపోతున్నాం. వృత్తి పరంగా ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. సామగ్రి ధరలు పెరిగిపోవడంతో రోజువారీ కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. డప్పు కళాకారులకు పింఛను ఇస్తున్నట్టుగానే ప్రభుత్వం స్పందించి 50 ఏళ్లు నిండిన టైలర్లకు కూడా పింఛన్, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి.

–ఆరుముగం, పాలసముద్రం, దళితవాడ టైలర్

రెడీమేడ్ దుస్తులతో పని తగ్గింది

మార్కెట్‌లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలరింగ్ పనికి డిమాండ్ తగ్గింది. కుటుంబ పోషణ కష్టమవుతోంది. ఎంతోకాలం ఇదేవృత్తిలో ఉండడంతో వేరేపని చేయలేక. కష్టంగా ఉంటున్నా. ప్రభుత్వం స్పందించి టైలర్లను ఆర్థికంగా ఆదుకోవాలి.

–బీయుల్లా తిరుముళరాజుపురం, టైలర్